క్లుప్తంగా

నేడు స్వచ్ఛతా ర్యాలీ

కందుకూరు అర్బన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పట్టణంలో పరిశుభ్రత పెంపొందించేందుకు, స్వచ్ఛతలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ శనివారం 3 గంటలకు పట్టణంలో స్వచ్ఛ కందుకూరు– స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, సబ్ కలెక్టర్ శోభిక, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు. ర్యాలీలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, స్వయం సహాయక సంఘాలు, అన్ని శాఖ వార్డు సచివాలయం సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు.

ఏపీఓ నాగరాజు సస్పెన్షన్

వెలిగండ్ల: ఉపాధి హామీ పథకం ఏపీఓ నాగరాజు, ఈసీ సత్యనారాయణలను సస్పెన్షన్ చేస్తూ డ్వామా పీడీ శీనారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఉపాధి పనులు చేసిన చోట నేమ్ బోర్డులు బిల్లులు సమర్పించక పోయారు. వాటిపై పీడీ శీనారెడ్డి విచారణ చేశారు. అందుకు బాధ్యులను చేస్తూ ఏపీఓ నాగరాజు, ఈసీ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారి స్థానంలో సీఎస్‌పురం ఏపీఓ సుబ్బారావును వెలిగండ్లకు ఇన్‌చార్జ్ ఏపీఓగా, వెలిగండ్లలో టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్‌ను ఈసీగా నియమించారు.

వైభవంగా వసంతోత్సవం



సీఎస్‌పురం: మండలంలోని జంగంవారిపల్లిలో శుక్రవారం వసంతోత్సవం, వనభోజనం వైభవంగా నిర్వహించారు. జంగంవారిపల్లిలో ఈ నెల 25 నుంచి పట్టాభిరామచంద్ర స్వామి తృతీయ వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం, పొంగళ్లు, వనభోజనాలు చేపట్టారు. స్వామిని గ్రామంలో ఊరేగిస్తూ వనంలోకి వెళ్లి పొంగళ్లు తయారు చేసి స్వామికి సమర్పించారు. వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి వన భోజనాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

95 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వాలిచర్ల, నందనవనం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. నందవనంలో 50 మందికి, వాలిచర్లలో 45 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మూరక ప్రతాపరెడ్డి, డాక్టర్ సందీప్, వైద్య సిబ్బంది, 104 వాహన వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైద్యాధికారికి ఉత్తమ సేవా పురస్కారం



కలెక్టర్ చేతులు మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రత్నావళి

కందుకూరు: మండలంలోని పలుకూరు హోమియో వైద్యాధికారి పి.రత్నావళికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం కలెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రశంసాపత్రం అందుకోవడంపై పలువురు వైద్యులు, వైద్యశాల సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

గుడ్లూరు: బ్యాంకుల ద్వారా పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను ప్రతి నెల సకాలంలో సక్రమంగా చెల్లించేలా చూడాలని ఏపీఎం అశోక్ అన్నారు. స్థానిక స్త్రీనిధి కార్యాలయంలో గ్రామైక్య సంఘాల అధ్యక్షులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేసుకుని తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకునేలా గ్రామైక్య సంఘాల అధ్యక్షులు చూడాలన్నారు. స్త్రీనిధి రికవరీ శాతం పెంచాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు మరియమ్మ, సభ్యులు రేవతి, మస్తాన్‌బీ, సీసీలు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

కందుకూరు అర్బన్: అంకమ్మతల్లి దేవాలయం పునఃనిర్మాణానికి భక్తులు గుమ్మళ్ల మాల్యాద్రి రూ.25,116, కనమర్లపూడి రవిశంకర్ రూ.25,116, అమ్మవారి పాదాల చెంత బంగారు యంత్రానికి పబ్బిశెట్టి కమల రూ.5,721 మొత్తం రూ.55,953 ఎమ్మెల్యే సమక్షంలో కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కొండూరి వసంతరావు, వెంకటరెడ్డి, ఆవుల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

పీసీపల్లి: మండల పరిధిలోని కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన కాకర్ల సుబ్బారావు అనే మేకల కాపరికి చెందిన 10 మేకపిల్లలను కుక్కలు దాడి చేసి చంపేశాయి. కాపరి మేకలకు మేత కోసం వెళ్లిన సమయంలో ఇంటి పేరట్లో ఉన్న మేకపిల్లలపై కుక్కలు దాడి చేశాయి. వీటి విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని వాపోయాడు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

● జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



రైతులతో మాట్లాడుతున్న జేసీ అభిషిక్త్ కిషోర్

పీసీపల్లి: సచివాలయ సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండాలని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అన్నారు. మండల పరిధిలోని ముద్దపాడు సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దగ్గర నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. అర్హులందరికీ ప్రతి పథకం అందేలా చూడాలన్నారు. గత ఏడాది ఈ క్రాప్ చేయించుకొని అగ్రికల్చర్ అసిస్టెంట్ నిర్వాకంతో నష్టపోయిన ప్రతి రైతుకు ఈ ఏడాది న్యాయం జరిగేలా చూడాలన్నారు. అతనిపై అందిన ఫిర్యాదుల మేరకు పరిశీలిస్తున్నామన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ అన్నారు. రెండో విడతలో మండలంలో 2 గ్రామాలు రీ సర్వేలో ఉన్నాయని, వాటి రీ సర్వే ఎంత వరకు వచ్చిందో సర్వే బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేలో ఫొటోలు, పేర్లు తప్పుగా ఎందుకు వస్తున్నాయని హెచ్చరించారు. రీసర్వేలో కూడా తప్పులు దొర్లకుండా చూడాలని సూచించారు. రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని, అర్హులకు సకాలంలో హక్కు పత్రాలు అందేలా చూడాలని సూచించారు. అసైన్‌మెంట్ పొలాన్ని అమ్మినా, కొనుగోలు చేసినా ఎటువంటి భూ హక్కు పత్రాలు ఉండవని తెలిపారు. జేసీ వెంట కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, ఓకేరెడ్డి, డీటీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కనిగిరి రూరల్: మండలంలోని పునుగోడులో ఈ క్రాప్ నమోదు చేసిన పంటల సర్వే నంబర్లను జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పునుగోడులో సర్వే నెంబర్ 57లో నమోదు చేసిన ఈ క్రాప్‌ను తనిఖీ చేసి వాస్తవికతను పరిశీలించారు. వ్యవసాయ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం ఏ పంటలు వేశారనేది తనిఖీ చేశారు. అలాగే బీకేపీ రోడ్డు బాధిత రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ సందీప్‌కుమార్, తహసీల్దార్ యు పుల్లారావు, ఏడీఏ వెంకట రమణ, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, వ్యవసాయ, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

కాఫీ విత్ గృహ సారథి



మాట్లాడుతున్న అశోక్‌బాబు

టంగుటూరు: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి నియమితులైన గృహ సారథులు తమ పరిధిలోని కుటుంబాల జీవన స్థితిగతులను తెలుసుకుని, వారికి పార్టీ తరఫున భరోసా ఇవ్వాలని ఆ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు సూచించారు. కాఫీ విత్ గృహ సారథి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టంగుటూరులోని రాజీవ్ నగర్‌లో షేక్ మదీనా ఇంటికి అశోక్‌బాబు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహ సారథులు వలంటీర్లతో సమన్వయం చేసుకుని సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించాలని చెప్పారు. అలాగే సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, బీసీడి ఉదయకుమార్, రావి రమణయ్య, మక్కెన వెంకయ్య, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు సూదనగుంట వెంకటస్వామి, ఎంపీటీసీలు బొడ్డు వాసంతి, కొమ్ము ప్రభుదాసు, పుట్టా రామకృష్ణ, దాసరి సుబ్బారావు, కొమ్ము బుజ్జి, దుగ్గిరాల పేరరాజు, తన్నీరు చిన్న వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన



కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కందుకూరు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో వాసవీ నగర్‌లో నూతనంగా నిర్మించనున్న వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాసవీనగర్‌లో కల్యాణ మండపం ఏర్పాటు చేయడం మంచి శుభపరిణామమన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారామయ్య, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గ్రంధి మధవి, వాసవీనగర్ ప్రెసిటెండ్ ఇడుపులపాటి రంగరావు, మురారి శెట్టి శ్రీకాంత్, పబ్బిశెట్టి శివ, అప్పల మధు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



పెట్లూరులో రైతులతో మాట్లాడుతున్న జేసీ అభిషిక్త్ కిషోర్

కొండపి: రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని జేసీ ఎం.అభిషిక్త్ కిషోర్ సూచించారు. మండలంలోని పెట్లూరు గ్రామంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ రబీ సీజన్‌లో వేసిన వరి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు పంటలు నష్టపోతే పరిహారం పొందడానికి ఈ క్రాప్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీఓ వి విశ్వేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు, సింగరాయకొండ ఏడీఈ ఈ నిర్మలకుమారి, తహసీల్దార్ పి.సింగారావు, ఏఓ వి.రాము, ఆర్ఐ హనుమంతరావు, వీఏఏ పద్మ, వీఆర్వో కొండలరావు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా నారాయణస్వామి విగ్రహ ప్రతిష్ట



మహా రుద్ర హోమంపూజలు చేస్తున్న భక్తులు



విగ్రహ ప్రతిష్ట అనంతరం స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి విగ్రహ ప్రతిష్ట శుక్రవారం వైభవంగా నిర్వహించారు. దాతల సహకారంతో స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి ఏకశిలా విగ్రహాన్ని ప్రతిష్టించేందు దేవాదాయ శాఖ అధికారులు అనుమతి పొందారు. అ మేరకు రూ.16 లక్షల ఖర్చుతో గ్రానైట్ రాయితో స్వామి ఏకశిలా విగ్రహాన్ని తీసుకు వచ్చి ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో మూడు రోజులుగా ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా శుక్రవారం గణపతి పూజ, గర్త పూజ, గర్తన్యాసం, విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, జ్వాల దర్శనం, బింబ దర్శనం, గో దర్శనం, సుదర్శన హోమం, మహా రుద్ర హోమం చేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ముదుమాల నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుల పర్యవేక్షణలో విగ్రహ ప్రతిష్ట చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ ఎస్పీ, డీఎస్పీ

పామూరు: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఏఓ ఉమాపతి, విజిలెన్స్ ఎస్సై నాగేశ్వరరావు అన్నారు. పామూరులోని ఎరువుల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. నెల్లూరురోడ్డుకు చెందిన ముప్పసాని శ్రీనివాసులు ఫర్టిలైజర్స్ అండ్ జనరల్‌స్టోర్స్‌లో యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించి దుకాణంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రైతులు ఎరువుల దుకాణాల్లో ఎరువులను, క్రిమిసంహారక మందులను, విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు విధిగా రసీదు పొందాలన్నారు. వ్యవసాయాధికారి కంచం రాధ, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

కనిగిరి రూరల్: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం కనిగిరిలో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ డీజీ ఆదేశాల మేరకు ఎస్పీ శ్రీభవాని హర్ష, డీఎస్పీ అశోక్‌వర్ధన్ నేతృత్వంలో దాడులు నిర్వహించారు. పట్టణంలోని రెండు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు శ్యాం, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



దుస్తులు అందచేస్తున్న చైర్మన్ గఫార్, వైస్ చైర్మన్ పులిశాంతి

కనిగిరి రూరల్: అంధుల ఆశాజ్యోతి లూయిస్ బ్రెయిలీ అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. అంధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కన్నమర్ల మీరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అంధుల కోసం చేసిన కృషిని కొనియాడారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సహకారంలో అంధుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం దాతల సహకారంతో అందచేసిన దుస్తులను చైర్మన్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్, కౌన్సిలర్ దేవకి రాజీవ్‌ల చేతుల మీదుగా అందచేశారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా దివ్యాంగులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సయ్యద్ అబ్దుల్ కలాం, సంక్షేమ సంఘ నాయకులు సింగయ్య, డోలక్ శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ సౌత్‌జోన్‌కు ఎంపిక



కోటేశ్వరావు కె.బ్రహ్మయ్య మురళీకృష్ణ

కందుకూరు రూరల్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 23 నుంచి 24వ తేదీ జరిగిన హ్యాండ్ బాల్ ఎంపికల్లో కందుకూరులోని గాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ సీహెచ్.రామకృష్ణారావు తెలిపారు. సౌత్ జోన్ పోటీలకు విశ్వవిద్యాలయం జట్టుకు కోటేశ్వరావు, కె.బ్రహ్మయ్య, ఎస్.మురళీకృష్ణలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను కళాశాల కరస్పాండెంట్‌తోపాటు డైరెక్టర్ సీహెచ్.భరద్వాజ్, ప్రిన్సిపాల్ పి.గీతాశ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి



సచివాలయ రికార్డులు పరిలీస్తున్న ప్రత్యేకాధికారి మాధవి

జరుగుమల్లి(సింగరాయకొండ): జగనన్న లేఅవుట్ లో గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి గ్రంధి మాధవి అధికారులకు సూచించారు. జరుగుమల్లి గ్రామ సచివాయంలో శుక్రవారం జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలపై మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రంధి మాధవి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు జగనన్న లేఅవుట్లలో 110 ప్లాట్లు లబ్ధిదారులకు మంజూరు చేయగా 5 గృహాలు మాత్రమే నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. మిగిలిన ప్లాట్లలో గృహ నిర్మాణాలు త్వరగా ప్రారంభించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఎంపీడీఓ పి.రామకృష్ణ, హౌసింగ్ అధికారి సింగ్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌ను విజయవంతం చేయండి

ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి ఈకేవైసీ రిజిస్ట్రేషన్లు చేయడంలో నూరు శాతం లక్ష్యాలు పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందికి మండల ప్రత్యేకాధికారి సూచించారు. వావిలేటిపాడు గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ పథకం వల్ల పేదలకు ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం లభిస్తుందన్నారు. గ్రామ వలంటీర్ సహకారంతో రెండు రోజుల్లో నూరు శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించాలన్నారు. సచివాలయంలో సేవల సంఖ్య పెరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ పి.రామకృష్ణ, గ్రామ సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

కందుకూరు అర్బన్: మున్సిపాలిటీ పన్నులు మార్చి నాటికి నూరుశాతం వసూలు చేయాలని కమిషనర్ ఎస్. మనోహర్ ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం వార్డు సచివాలయ సిబ్బందితో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మనోహర్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి పన్నుల రూపంలో మొత్తం 5.12 కోట్లు రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.3 కోట్లు మాత్రమే వసూలైనట్లు చెప్పారు. మార్చి చివరి నాటికి మిగిలిన మొత్తం వసూళ్ల చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పొగాకులో అన్యపదార్థాలతో నష్టం



పొగాకును పరిశీలిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు, బోర్డు అధికారులు

టంగుటూరు: పొగాకులో అన్యపదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకొవాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలోని ఎం. నిడమానూరు గ్రామంలో రైతులకు ఆకు రెలుపులు, క్యూరింగ్, గ్రేడింగ్, పంట ఉత్పత్తి నిర్వహణపై క్షేత్ర సిబ్బందికి శిక్షణ కార్యక్రమం శుక్రువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్డు అధికారులు, కంపెనీల ప్రతినిధులు పొగాకు తోటలతోపాటు క్యూరింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్జీఓ సునీల్‌కుమార్, ఐటీసీ కంపెనీ ప్రతినిధి వెంకట్రావు, జీపీఐ కంపెనీ ప్రతినిధి ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేని లే అవుట్‌లో ప్లాట్లు కొనొద్దు

కందుకూరు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేని లే అవుట్లో ప్రజలు ప్లాట్లు కొని మోసపోవద్దని కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. మహదేవపురం లేఅవుట్‌కు ఎటువంటి అనుమతులు లేవన్నారు. మధ్య తరగతి ప్రజల కోసం ఉప్పుచెరువు ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఎంఐజీ లేఅవుట్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎంఐజీ లేఅవుట్‌లో సకల సౌకర్యాలతో, రోడ్లు, డ్రైనేజీలు, అండర్ గ్రౌండ్వాటర్ ట్యాంక్, పార్కు వంటి తదితర వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఎంఐజీ లేఅవుట్‌లో లేదా ప్రభుత్వం అనుమతి ఉన్న లే అవుట్‌లో ప్లాట్లు ప్రజలు కొనుగోలు చేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ప్రాణం ఎంతో విలువైంది



మాట్లాడుతున్న సీఐ పాపారావు

కనిగిరి రూరల్: ప్రాణం విలువ ఎంతో విలువైందని, ఒక ప్రాణాన్ని కాపాడితే మనం దేవుడితో సమానమని సీఐ బి.పాపారావు అన్నారు. స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాల సభ ఇన్‌చార్జి డీఎం జె.సుందరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పాపారావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగితే ప్రాణం నష్టంతో పాటు, ఆ కుటుంబాలు వీధిన పడుతాయని గుర్తు చేశారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. దూర ప్రయాణాల్లో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. నిర్లక్ష్యంతో వ్యవహరిస్తే తమ జీవితంతో పాటు, ఇతరుల జీవితాలకు కూడా నష్టం వాటిల్లుతుందన్నారు. డ్రైవర్లు విధి నిర్వహణలో కుటుంబసభ్యులను గుర్తు చేసుకుంటూ బాధ్యతగా వాహనాలను నడపాలన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం ప్రమాదాలు జరిగినప్పుడు గోల్డన్ అవర్ గురించి అవగాహన కల్పించారు. డ్రైవర్లు డ్యూటీ దిగిన తర్వాత కచ్చితంగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ షాజాహాన్, డిపో అధికారుల, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

సీఎస్‌పురం: విద్యాభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని పెదగోగులపల్లి, ఉప్పలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఆరెపాలెం ప్రాథమిక పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల పరిధిలో విద్యార్థుల విద్యాభివృద్ధి గురించి, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ గురించి వాకబు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం జేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని, అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించి కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



టంగుటూరులో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

టంగుటూరు: స్థానిక పురం సెంటర్లో స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని విద్యుత్ శాఖ సీఐ టీఎక్స్ అజయ్‌కుమార్ శుక్రువారం పంపిణీ చేశారు. మొత్తం 150 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించగా 63 మందికి ఆపరేషన్లు అవసరం అని గుర్తించారు. వీరికి స్ఫూర్తి సంస్థ సొంత నిధులతో ఆపరేషన్ చేసేందుకు పలుకూరులోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారులు, ఆదాయపన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు నత్తల హరిబాబు, ఏల్చూరి వెంకటశేషమ్మ దుగ్గిరాల సునీల్ కుమార్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈ క్రాప్ నమోదు

పీసీపల్లి: మండలంలో ఈ క్రాప్ నమోదు పారదర్శకంగా జరగాలని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి ఎస్ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని పెదయిర్లపాడు, అలవలపాడు గ్రామాల్లో శుక్రవారం రబీ ఈ క్రాప్ నమోదు, ఈ కేవైసీ నమోదును పరిశీలించారు. పంట వేసిన ప్రతి ఒక్క రైతు పంటను ఈ క్రాప్ చేయాలని, అలాగే కేవైసీ కూడా పూర్తి చేయాలన్నారు. నెలాఖరు లోగా ప్రక్రియ పూర్తి చేసి అన్ని ఆర్బీకేల్లో జాబితాలు ప్రదర్శించాలన్నారు. అనంతరం గుడేవారిపాలెం ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. వ్యవసాయాధికారి జి. వెంకటస్వామి, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏడాదికి ఒక దూడతో లాభదాయకం

కందుకూరు రూరల్: మండలంలోని మోపాడులో శుక్రవారం పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పశుసంవర్ధక శాఖ కందుకూరు డివిజన్ సహాయ సంచాలకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఏడాదికి ఒక దూడ ఉత్పత్తి చేయడం ద్వారా పాడి పశుపోషకులు లాభదాయకంగా ఉంటుందన్నారు. పశువుల్లో గర్భకోశ వ్యాధులను సరైన సమయంలో గుర్తించి చికిత్స చేయించుకుంటే ఏడాదికి ఒక దూడను ఉత్పత్తి చేయవచ్చన్నారు. దీని ద్వారా పాల దిగుబడి కూడా పెరుగుతుందని చెప్పారు. కందుకూరు సహాయ సంచాలకుడు శ్రీధర్‌రావు మాట్లాడుతూ మినరల్ మిక్చర్, దాణా, పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు వహిస్తే పాడి పశువుల రైతులకు ఏడాదికి ఒక దూడ జన్మిస్తుందన్నారు. పశువైద్యాధికారి సీహెచ్ చెన్నకేశవులు మాట్లాడుతూ నెలకు రెండు సార్లు జరిగే పశువిజ్ఞాన బడిని రైతు వినియోగించుకోవాలన్నారు.